ఆనందభైరవి - రూపకం
యింతి వుపచార పూజ - యిందే గలిగెనీకు
వంతుల జేకొని నీవు - వరమియ్యవయ్యా

ఆంగన నిన్ను జూచుటే - ఆవాహనము ఆమెకు
ఆంగవించి నీవు మతి - హత్తినదే ఆసనము
సంగతి నీపై చింతే - సదా ధ్యానము సుమ్మీ
అంగపు జొక్కు జెమట - లర్ఘ్యపాద్యాదులు

సరుస గన్నీళ్లే ఆ - చమనము జలకము
ఆరవిరిప య్యెదయు - అంగ వస్త్రము
నిరతి మైకమ్మదావి - నీకు నిచ్చిన గంధాలు
పరగిన పులకలే - పలుపూజలు

దొమ్మివూర్పు విరహాగ్ని - ధూపము దీపమునాయె
సొమ్ములే మైమెఱుగులు - సోలి నీగేవే దండాలు
నమ్మిక శ్రీ వేంకటేశ - నైవేద్యమాయె మోవి
కమ్మర గాగిటి నవ్వే - కప్పురపు విడేలు

నిన్నే రూపముగా భజింతు మదిలో, నీ రూపు మోకాలో స్త్రీ చన్నోకుంచమో, మేక పెంటికయో అంటాడు ధూర్జటి మహాకవి శ్రీకాళహస్తీశ్వర శతకంలో. ఏ రూపు గానైనా భగవదారాధన చేయగలరు మహాపురుషులు. కానీ సంభోగ శృంగారంలో షోడశోపచారపూజ నెరవేర్చినఘనత అన్నమయ్యకే చెల్లింది.

ఆమె నిన్ను వీక్షించినదే ఆవాహనం నీకు. ఆమె మనసులో ఉత్పన్నమై మది హత్తు కొన్న నీపై కోరిక నీకు ఆసనం. నీతో శృంగార భావనమే ఆమె నీకిచ్చే ధ్యానపూజ. మన్మధుని అరణి వల్ల జనించే చొక్కపు చెమటలే, నీకు ఆర్ఘ్యము పాద్యము. పునరర్ఘ్యమునూ. (నీవు చెంతరానందున) సరోషపు ఆమె కన్నీళ్లే నీకు ఆచమనమూ, జలకమును, సగం జారిన ఆమె పయ్యెద నీకు వస్త్ర సమర్పణ. నిత్యమైన ఆమెమేని కమ్మ ని సుగంధపరిమళం నీకర్పించిన చందన గంధం. మిక్కుటమై ఆమె మేన పొడమే పులకాంకురములే నీకు బహువిధసుమ పూజలు.

విరహ తాపంలో ఆమె వెడలించే ఊర్పుల వేడి అగ్ని నీకు ధూపము, దీపము.

ఆమెశరీర సువర్ణకాంతులే నీకు హిరణ్యాభరణాలు. అవశయ్యై నీ మేన వ్రాలుటే దండాలు. ఆమె అధరామృతం నీకు పంచామృత నైవేద్యం. తన సర్వస్వమూ నీ కర్పించి, బిగి కౌగిట ఆమె నవ్వే నవ్వులే నీకు కర్పూర తాంబూలాలు. ఈ యింతి అలమేల్మంగ షోడ శోపచార పూజలు ఈ విధంగా నీ కొనర్చినది. క్రమక్రమంగా ఈ పూజలన్నీ స్వీకరించు. ఆమె కోరిన జగత్కల్యాణపు వరమియ్యవయ్యా శ్రీవేంకటేశ్వరా అంటూ స్వామికి ఉద్బోధి స్తున్నారు అన్నమాచార్యులు. షోడశ కళానిధికి అన్న సంకీర్తనమూ, ఈ సంకీర్తనమూ తులనాత్మకంగా చూస్తే అన్నమాచార్యులు భావుకత ఎంత ఉత్కృష్టమైనదో తెలుస్తుంది.